గాజువాక శరవేగంగా విస్తరించింది. పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందింది. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు ఆశ్రయం ఇచ్చింది. దీంతో వారి అభిరుచులకు తగ్గట్టుగా వ్యాపార సంస్థలు గాజువాకలో తమ బ్రాంచ్‌లు ప్రారంభించాయి. మరికొన్ని ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో అటు పారిశ్రామికంగా ఇటు **వాణిజ్య పరంగా గాజువాక దూసుకుపోతుంది.**

వాణిజ్యవాక

- గాజువాకకు క్యూ కడుతున్న షాపింగ్ మాళ్లు
- వాలిపోతున్న ప్రముఖ బ్రాండ్ల షోరూంలు
- పోటాపోటీగా నగలు, వస్త్ర దుకాణాలు, రెస్టారెంట్ల బ్రాంచ్‌ల ఏర్పాటు


గాజువాక మెయిన్ రోడ్‌లో వ్యాపార సముదాయాలు

గాజువాక: పారిశ్రామిక ఖ్యాతిని సొంతం చేసుకున్న గాజువాకకు కార్పొరేట్ సంస్థలు క్యూ కడుతున్నాయి. పంచాయతీ నుంచి మున్సిపాల్టీ స్థాయికి ఎదిగిన గాజువాక ఇప్పుడు గ్రేటర్‌లో భాగమైంది. పారిశ్రామిక పట్టణంగా గుర్తింపు పొందిన ఈ పట్టణం ప్రస్తుతం భారీ పెట్టుబడులకు వేదికవుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలకు చెందిన ఆధునిక షాపింగు మాళ్లు, ఐనాక్స్ థియేటర్లు, బంగారు, వస్త్ర దుకాణాలతో పాటు వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థలు గాజువాక వాకిట్లో కొలువుదీరుతున్నాయి.

ప్రాంతాల వారీగా షోరూమ్‌ల ఏర్పాటు

షీలానగర్, కూర్మన్నపాలెం, శ్రీనగర్ ప్రాంతాల్లో పలు వాహన షోరూమ్‌లు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

- పాతగాజువాక జంక్షన్ నుంచి సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్త గాజువాక వరకు ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలకు చెందిన ఆధునిక షోరూమ్‌లు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు మరిన్ని సంస్థలకు చెందిన మాళ్లు, హాళ్లు ఇక్కడ ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

పేరుమోసిన వ్యాపార సంస్థల క్యూ

ఖరీదైన వస్తువు కొనాలంటే నగరానికి పరుగులు తీయాల్సిన రోజులు పోయాయి. కార్పొరేట్ షాపింగ్ మాళ్లు తమ బ్రాంచ్‌లను ఇక్కడ భారీ పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్నాయి. కొనుగోలుదారుల అవసరాలు ఇక్కడే తీరుతున్నాయి. బ్రాండెడ్ దుస్తులు, ఆభరణాలు, ఇతర సామగ్రి ఇక్కడే లభిస్తున్నాయి. నగరంలో పేరుమోసిన వాణిజ్య సంస్థలన్నీ గాజువాకలో ప్రాంతంలో తమ శాఖలను విస్తరిస్తున్నాయి. సీఎంఆర్ షాపింగ్‌మాల్, ఎస్ఆర్ షాపింగ్ మాల్, బొమ్మనా, శ్రీ శ్రీనివాసా, కంకటాల, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్‌కే స్టోర్స్, కళానికేతన్, ఖజానా జ్యూయలర్స్, జీఆర్‌టీ జ్యూయలర్స్, మలబార్ జ్యూయలర్స్, జాయ్ అలుకాస్, అరవింద్, అమర్‌దీప్, లీ ఫ్యాషన్స్, కంటిపూడి నిస్సాన్, ఎస్ఆర్ఎంటీ, బీన్యూ మొబైల్ షోరూమ్, బిగ్‌సీ, సెల్ డాట్ కామ్, సామ్‌సంగ్, షావోమి తదితర సంస్థలకు చెందిన బ్రాంచిలు గాజువాకలో ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, బంగారం, ఎలక్ట్రానిక్స్, జనరల్ స్టోర్స్, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు తదితర సంస్థల నుంచి ఇక్కడ రోజుకు సగటున రెండున్నర కోట్ల రూపాయల వరకు వ్యాపారం సాగుతుందని అంచనా. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, రం


గాజువాకలోని క్లాత్ షోరూమ్‌లో కొనుగోలు దారుల రద్దీ

జాన్ పండుగల్లో రోజుకు రూ.10 నుంచి రూ.15 కోట్ల రూపాయలవరకు వ్యాపారం సాగుతుందని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కార్పొరేట్ సంస్థలు ఇక్కడ తమ సంస్థలను నెలకొల్పడానికి ముందుకొస్తుండడంతో ఈ ప్రాంతం వాణిజ్యంగా కూడా పరుగులు పెడుతోంది.

స్వరూపం మారింది



పది, పదిహేనేళ్ల కిందటతో పోల్చితే గాజువాక స్వరూపం పూర్తిగా మారిపోయింది. కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన షోరూమ్‌లు, వాటి బ్రాంచ్‌లు బాగా పెరిగాయి. అన్ని రకాల బ్రాండ్‌లకు సంబంధించిన వస్తువులు ఇక్కడే దొరుకుతున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, బీహెచ్ఈఎల్, షిప్‌యార్డు వంటి ప్రభుత్వరంగ సంస్థల కారణంగా ఈ ప్రాంతం చాలా వేగంగా అభివృద్ధి జరిగింది.

–ఎం.సిద్ధార్థ కిశోర్, గాజువాక

భవిష్యత్ మరింత ఉజ్వలం



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి. విశాఖ నగరంలో గాజువాక మరింత అభివృద్ధి సాధించింది. ఇక్కడ ఏర్పాటైన ప్రభుత్వ రంగ పరిశ్రమలు, వాటికి అనుబంధంగా ఏర్పడిన ప్రైవేట్ **పరిశ్రమలతో ఉపాధి** బాగా పెరిగింది. పారిశ్రామికంగా **అభివృద్ధి** చెందిన గాజువాక కార్మిక కుటుంబా**లకు కూ**డా కేంద్రంగా మారింది. ఈ కార**ణంగా** అన్ని సంస్థలు తమ వ్యాపారా**లను** గాజువాకలో విస్తరించాయి. ఈ వేగం ఇలాగే కొనసాగితే భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది.

–హరి శ్రీనివాసరావు, గాజువాక

శరవేగంగా గాజు'వాక్'

భెల్, గాజువాక, పెదగంట్యాడ ఆటోనగర్, విశాఖ స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, పరవాడ ఎన్‌టీపీసీ, హిందూజా విద్యుత్ పరిశ్రమలు, లంకెలపాలెం ఫార్మాసిటీ పరిశ్రమలు, గంగవరం పోర్టు, అచ్యుతాపురం, దువ్వాడ ఎస్ఈజెడ్‌లకు గాజువాక కేంద్ర బిందువు కావడంతో ఇక్కడకు కార్మికులు, కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో వలస వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజువాక జనాభా ఏటికేడాది లక్షల సంఖ్యలో పెరుగుతోంది. పరిశ్రమలకు కేంద్రం కావడం, కార్మిక కుటుంబాలు అత్యధిక సంఖ్యలో ఈ ప్రాంతంలోనే నివసిస్తుండడంతో పాటు గాజువాక తలసరి ఆదాయం కూడా రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో వ్యాపారాలు వృద్ధి చెందుతున్నాయి. క్రమంగా గాజువాక కొత్త రూపు సంతరించుకుంటోంది.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి


బాల వినాయక స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వినాయక స్వామి, ప్రసన్న వేంకటేశ్వర సామి ఆలయాల్లో మంగళవారం సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు చరణ్, మూర్తి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

ఎంపీ దృష్టికి థ్రిఫ్ట్ సొసైటీ సమస్యలు


ఎంపీ భరత్‌కు సమస్యలు వివరిస్తున్న థ్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీకి యాజమాన్యం చెల్లించాల్సిన నిధులను ఇప్పించేలా చర్యలు చేపట్టాలని థ్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గ ప్రతినిధులు విశాఖ ఎంపీ ఎం. శ్రీ భరత్‌ను కోరారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనంద్ కుమార్, కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి, చీఫ్ మేనేజర్ దామోదర్‌రెడ్డి మంగళవారం ఎంపీని కలిసి థ్రిఫ్ట్ సొసైటీ సమస్యలను వివరించారు. ఉక్కు యాజమాన్యం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేసిన రూ. 78.57 కోట్లు సొసైటీకు చెల్లించ లేదన్నారు. దాని వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పొదుపు చేసిన వారికి చెల్లింపులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు.

ముగిసిన మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్


దంత పరీక్షలు చేస్తున్న నేవీ వైద్యాధికారి

పెదగంట్యాడ: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని ఈఎన్‌సీ సీఎంవో అజిత్ గోపీనాథ్ అన్నారు. నేవీ డే –2024ను పురస్కరించుకుని యారాడ గ్రామంలో రెండు రోజుల పాటు మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 8 మంది వైద్య నిపుణుల బృందం గ్రామస్తులతో పాటు 85 మంది విద్యార్థులకు డెంటల్, ఈఎన్‌టీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో పలు చోట్ల నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మంగళవారం నిర్మాణ పనులను వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పరిశీలించారు. గ్రామంలో రామాలయం నుంచి ప్రధాన రోడ్డు వరకు, జిల్లా పరిషత్ హైస్కూల్ పక్క నుంచి విశాఖ డెయిరీ క్వార్టర్స్ వరకు, వివేకానందకాలనీ ప్రధాన రోడ్డు నుంచి బస్‌స్టాప్ పక్కగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

- ప్రజాఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు
- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్


సమావేశంలో పాల్గొన్న జోనల్ అధికారులు, సిబ్బంది

గాజువాక: గాజువాక జోన్‌లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అధికారులు, వార్డు కార్యదర్శులు పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. గాజువాక జోన్ పరిధిలోని అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతివారం అందుతున్న ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఫిర్యాదులు రిపీట్ అయితే సంబంధిత విభాగఅధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం

గాజువాక జోన్ ప్రాంతంలో అవసరమైన చోట గ్రావెల్ రోడ్లను తారు రోడ్లు వేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం గాజువాక జోన్‌లో జరుగుతున్న భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణ పనులను అంతర్గతం చేస్తూ రోడ్లు నిర్మించాలన్నారు. ఇతర సంస్థలకు సంబంధించిన రోడ్ల అభివృద్ధిపై ఆయా సంస్థలకు తెలియజేసి వారు రోడ్లను అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జీవీఎంసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను గుర్తించి వాటి సంరక్షణకు తక్కువ ఖర్చుతో పచ్చదనం పెంపొందించాలన్నారు. శ్మశాన వాటికల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, వీధి దీపాలపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

పన్నుల వసూలుపై దృష్టి

ఆస్తిపన్నులు, నీటి చార్జీలు సకాలంలో వసూలు చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆస్తి పన్ను వసూలుతో పాటు కొత్త నిర్మాణాలకు పన్ను విధింపులు కూడా చేపట్టాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించినా, అడ్మిన్ కార్యదర్శులు పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శించినా షోకాజ్ నోటీసులను జారీ చేయాలని డీసీఆర్ ఎస్.శ్రీనివాస్‌ను ఆదేశించారు. అందరికీ నీటి కుళాయిలు వేసి తద్వారా జీవీఎంసీ ఆదాయాన్ని పెంచాలన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

అనధికార నిర్మాణాలపై అలసత్వం వద్దు

అనధికార నిర్మాణాలపై జీవీఎంసీకి ప్రజాఫిర్యాదులు విరివిగా అందుతున్నాయి.. ఈ విషయంలో ప్లానింగ్ కార్యదర్శుల విధుల్లో లోపం కనిపిస్తోందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేసి అనధికార, అక్రమ నిర్మాణాలకు చెక్ పెట్టాలని సీపీపీ ఎ.ప్రభాకర్‌రావును ఆదేశించారు. నగరాన్ని బిన్ ఫ్రీ సిటీగా తీర్చి దిద్దేందుకు ఇంటింటి నుంచి వ్యర్థాలను సేకరించడానికి కొన్ని రోజులపాటు యూసీడీ విభాగంలోని ఆర్‌పీల సహకారం తీసుకోవాలన్నారు. వారి ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, ప్రధాన ఇంజినీర్ పి.శివ ప్రసాద్‌రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, పర్యవేక్షక ఇంజీర్ గోవిందరావు, సీపీ మీనాకుమారి, డీసీపీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల వేతనాల చెల్లింపుపై జోక్యం చేసుకోండి

లేబర్ కమిషనర్‌కు సిటూ ఫిర్యాదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాల చెల్లింపులో జరుగుతున్న అన్యాయంపై జోక్యం చేసుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ)కు ఫిర్యాదు చేశారు. సీఐటీయూ నాయకులు ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉక్కు యాజమాన్యం గతేడాదిగా 50 శాతం చొప్పున రెండు వాయిదాల్లో జీతం ఇచ్చే కొత్త సంప్రదాయం తెచ్చిందన్నారు. సెప్టెంబర్ జీతం కేవలం 50 శాతం మాత్రమే ఇచ్చారన్నారు. ఈనెల అక్టోబర్ నెల జీతంలో కేవలం 35 శాతం మాత్రమే చెల్లించారన్నారు. అరకొరగా జీతం చెల్లించడం ద్వారా ఉద్యోగులను యాజమాన్యం వేధిస్తుందన్నారు. యాజమాన్యం చర్యల వల్ల ఉద్యోగులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితులు దాటి ఉద్యోగులకు ఏమైనా జరిగితే వారి కుటుంబాలకు ఎవరు బాధ్యులన్నారు. సకాలంలో సక్రమంగా జీతాలు చెల్లించేలా యాజమాన్యానికి సూచించాలని యూనియన్ అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

ఆ పాఠశాలలను విశాఖ జిల్లాలో కలపండి


డీఈవో అప్పారావు నాయుడికి వినతిపత్రం అందిస్తున్న అగనంపూడి నాయకులు

అగనంపూడి: రెండు జిల్లాలు, రెండు మండలాల మధ్య అస్తవ్యస్తంగా ఉన్న అగనంపూడి నిర్వాసితకాలనీల పాఠశాలలను విశాఖ జిల్లాలో విలీనం చేయాలని అగనంపూడికి చెందిన నాయకులు అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అగనంపూడి నిర్వాసితకాలనీలు గతంలో పరవాడ మండల పరిధిలో ఉండడంతో గాజువాక మండల పరిధిలోకి గ్రామాలు తరలించినా నేటికీ పరవాడ మండల విద్యాశాఖ పర్యవేక్షణలో కొనసాగిస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ పాఠశాలలను విశాఖ జిల్లాలో కలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు రమేష్, ఎం.వి.రమణ, కె.హనుమంతురావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధీర వనిత ఇందిరా గాంధీ


ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి గాజువాక కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక వుడా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, నాయకులు ఎస్.వీరారావు, కట్టా అప్పారావు, ఎ.వీరుబాబు, ఎస్.అప్పారావు, పెంటినాయుడు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి పాల్గొని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ, నాయుడు, మనోహర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఏసీపీ ఔదార్యం

ఉక్కునగరం: ట్రై సైకిల్‌పై వెళ్తున్న దివ్యాంగుడిని దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం ద్వారా సౌత్ ఏసిపి టి. త్రినాథ్ ఔదార్యం చాటుకున్నారు. వివరాలిలా.. రెండు రోజుల కిందట స్టీల్‌ప్లాంట్ రహదారిలో ఒక వృద్ధుడైన దివ్యాంగుడు ట్రై సైకిల్ పై వెళ్తూ ముందు వెళుతున్న ఎటు వెళుతున్నారని తెలుసుకోవడానికి హారన్ మోగించాడు. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తి కోపగించుకుని దివ్యాంగుడిని దుర్భాషలాడాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న సహ చట్టం కార్యకర్తలు పట్టా రామఅప్పారావు, కాసా పద్మరాజు బాధితుడితో స్టీల్‌ప్లాంట్ సీఐని కలిసి ఫిర్యాదు చేశారు. అతడి నుంచి సరైన స్పందన లభించకపోవడంతో విషయాన్ని సౌత్ ఏసీపీ త్రినాథ్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఏసీపీ ఆ బైక్ వ్యక్తిని పిలిపించి దివ్యాంగునికి రాత పూర్వకంగా క్షమాపణ చెప్పించారు. దీంతో ఆ దివ్యాంగుడు కృతజ్ఞతలు తెలిపాడు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


దివ్యహారతి పూజ నిర్వహిస్తున్న నిర్వాహకులు పొన్నాడ వాసుదేవరావు, లలిత దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో అయ్యప్ప భక్తులు, భవానీలు అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావు, లలిత కుమారి దంపతులు ఏర్పాటు చేసిన పూజలో 700 మంది అయ్యప్ప భక్తులు, భవానీలు పాల్గొని 18 సోపానాలపై దివ్య హారతిపూజ నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. భక్తులు తన్మయత్వంతో భజన గీతాలు ఆలపించారు.అయ్యప్ప సేవా సంఘం గురుస్వామి అదపాక వెంకటరమణ పర్యవేక్షణలో అంబలం పూజ అంబరాన్ని తాకింది. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పికొండ శివాలయం ఛైర్మన్ పరదేశా..!


అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం వద్ద వెలసిన ఫ్లెక్సీ

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ చోడిపిల్లి పరదేశా!.. అయితే పాత ఛైర్మన్ కొవిరి గంగరాజును తొలగించారా!.. కమిటీ సభ్యులను మార్చివేశారా!.. అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. కార్తీకమాసం 3వ సోమవారం అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అయితే ఆలయం బయట అప్పికొండ శివాలయ ఛైర్మన్ చోడిపిల్లి పరదేశి పేరుతో వెలసిన ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది. గతేడాది మార్చిలో ఎండోమెంట్ కమిషనర్ దేవస్థానం కమిటీని ప్రకటించారు. అందులో కొవిరి గంగరాజు, చేపల దానయ్మ, మల్లువలస సన్నిబాబు, గల్లి లక్ష్మి, మద్ది అప్పారావు, ఎరిపిల్లి రాములమ్మ, , మండ గౌరీలక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాటి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కమిటీ పదవీ కాలం రెండేళ్లు. పదవీ కాలం ముగియకుండానే కొత్త ఛైర్మన్‌గా చోడిపిల్లి పరదేశి పేరుతో వెలసిన ఫ్లెక్సీ గురించి అందరూ చర్చించుకుంటున్నారు.

కమిటీ మారలేదు

ఆలయం వెలుపల వెలసిన ఫ్లెక్సీ విషయమై దేవస్థానం ఈవో జగన్నాథంను వివరణ కోరగా పాత కమిటీయే కొనసాగుతోందని చెప్పారు. ఆలయం బయట వెలసిన ఫ్లెక్సీ విషయం తమకు తెలియదన్నారు.

జీతం కోసం కొవ్వొత్తుల ర్యాలీ నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు స్టీల్‌ప్లాంట్ జంక్షన్ నుంచి వేంకటేశ్వరస్వామి గుడి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. మహిళలు ఈ ర్యాలీలో పాల్గొని జీతాల సాధనకు సహకారం అందించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు.

పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన


పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్

పెదగంట్యాడ: రానున్న మూడు నెలలు పదో తరగతి విద్యార్థులకు ఎంతో కీలకం.. ప్రణాళిక ప్రకారం చదివితే విజయం మీదేనని విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంఘం (జిప్సా) అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష రాసే విధానం, ఒత్తి డిని జయించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏఏ పాఠ్యాంశాలు చదవాలి, ఎంత సమయంలోగా జవాబులు రాయాలనే అంశాలను వివరించారు. మింది హైస్కూల్ ఉపాధ్యాయులు రమణ, మధురిమ హిందీ సబ్జెక్టుకు సంబంధించి బ్లూప్రింట్ గురించి వివరించారు. సోషల్ స్టడీస్‌కు సంబంధించిన వివరాలను నరవ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు శ్రీధర్ వివరించారు. జిప్సా కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, గౌరవ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కోశాధికారి ఎం.బాబూరావు, సలహాదారులు జగ్గారావు, మురళీ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుర్చీలాట


మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

గాజువాక: గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మ్యూజికల్ చైర్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్టు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు.

అమెరికన్ వీసాపై అవగాహన


అమెరిన్ కాన్సులేట్ జనరల్ డిప్యూటీ కాన్సులర్ జెన్నీని సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

అగనంపూడి: అమెరికన్ వీసా పొందేందుకు నిర్వహించే ప్రక్రియపై అవగాహన అవసరమని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ డిప్యూటీ కాన్సులర్ ఎస్.జన్నీ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థులకు మంగళవారం అమెరికన్ వీసా ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీసా దరఖాస్తు, ఇంటర్వ్యూ, డాక్యుమెంటేషన్, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఎంబీఎ హెడ్ ఎస్.ఎం. మురళీకృష్ణ, కోఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శక్తి స్వరూపిణీ దినోత్సవం


సత్యసాయి మందిరంలో సీమంతంలో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం శక్తి స్వరూపిణీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన గర్భిణులకు సీమంతాలు జరిపించారు. సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో అగనంపూడి, దేశపాత్రునిపాలెం గ్రామాలకు చెందిన 13 గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ, పండ్లు, గాజులు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయికు పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా సేవా విభాగం సమన్వయకర్త వి. పద్మ, వై. గౌరీ కామేశ్వరి, జయశ్రీ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం

గాజువాక: త్వరలో నియమించనున్న బూత్ కమిటీల్లో అన్ని వర్గాల శ్రేణులకు ప్రాధాన్యం కల్పిస్తామని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన కొత్తగాజువాక మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో 12 మందితో కీలక కమిటీ, 20 మందితో పేజీ ప్రముఖ్‌లను నియమించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి రంగనాయకులు, ప్రసాద్ శర్మ, సూరిబాబు పాల్గొన్నారు.